నాసిరకంగా ఉపాధి రోడ్లు

- నెర్రెలిచ్చిన సీసీ రహదారులు
- నాణ్యత ప్రమాణాలపై ప్రజల మండిపాటు
- పట్టించుకోని అధికారులు



• ఈ చిత్రంలోని సీసీ రోడ్డు నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలోని హమాలీ కాలనీలో వేశారు. రూ.20 లక్షల నిధులతో ఈ పనులను అధికార పార్టీ కార్యకర్తలు చేపట్టారు. కానీ పనులు చేసిన వారం రోజులకే రోడ్డు నెర్రెలు, చీలికలు రావడంతో కాలనీప్రజలు విస్తుపోతున్నారు. పనులు నాణ్యతగా చేపట్టడానికీ ఇంజనీర్లు ప్రయత్నించినా, అధికార పార్టీ ఒత్తడితో ఏం చేయలేక పోయారు. కాలనీలో వేసిన సీసీ రోడ్లు నాణ్యతగా లేవని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.



• ఈ చిత్రంలోని సీసీ రోడ్డు శింగనమలలోని బెస్త వీధిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణాఇకి శింగనమల పంచాయతీకి రూ.39 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులు నాసిరకంగా చేపట్టడంతో వేసిన వారం రోజులకే నెర్రలు చీలిపోతున్నాయి. సైడ్ వాల్‌లు పడిపోతున్నాయి. ఇలా నియోజకవర్గవ్యాప్తంగా కూటమి నేతలు వేసిన రోడ్లు నాణ్యత లోపించాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

శింగనమల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీసీ రోడ్ల నిర్మాణ పనులను అధికార పార్టీ నాయకులు చేస్తున్నారు. పనులు నాసిరకంగా వేయడంతో, వేసిన వారం రోజులకే నెర్రలు చీలిపోయి కంకర తేలాయి. శింగనమల మండలంలోని శింగనమల, సోదనపల్లి, వెస్ట్ నరసాపురం, ఆకులేడు, లోలూరు, గుమ్మేపల్లి, నాగులగుడ్డం తండా, కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, నాయనవారిపల్లి, మట్లగొంది, సలకంచెర్వు, చక్రాయిపేట, పెరవలి, జూలకాల్వ, కొరివిపల్లి, ఉల్లికల్లు గ్రామ పంచాయతీలకు దాదాపు రూ.3.50 కోట్లు నిధులతో 45 పనులు మంజూరయ్యాయి. శింగనమల గ్రామ పంచాయతీలో రూ.39 లక్షలు సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను టీడీపీ నాయకులు చేస్తున్నారు. శింగనమలలోని హమాలీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం పనులు చేశారు. కాని వేసిన వారం రోజులకే రోడ్డు నెర్రెలు చీలడంతో నాణ్యత లోపించిందని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తడితో పనులు పర్యవేక్షించిన ఇంజినీర్లు ఎదురు చెప్పలేకపోయారు. దీంతో నాయకులు నాసిరకంగా పనులు చేసి జేబులు నింపుకున్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు నిర్మాణంలో నాణ్యత లోపించిందని ప్రజలంటున్నారు. కాగా నాణ్యత లోపించిన పనులపై డీఈ అరుణకుమార్‌ను సాక్షి వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో రాలేదు.



శింగనమల హమాలీ కాలనీలో నాసిరకంగా వేసిన రోడ్డు

సీసీ రోడ్లు నాణ్యత లోపించాయి



ఉపాధి పథకం కింద గ్రామాల్లో వేస్తున్న సీసీ రోడ్లు నాణ్యత లోపించాయి. ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఇస్తున్న నిధులు సక్రమంగా వినియోగించడం లేదు. శింగనమల మండలంలో పలు గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లు, వేసిన వారం రోజులకే నెర్రెలు చీలుతున్నాయి. ఇంజినీర్లు పర్యవేక్షించి రోడ్లు నాణ్యతగా నిర్మించాలి.

– భాస్కర్, సీపీఎం మండల కన్వీనర్, శింగనమల

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	పనుల సంఖ్య	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
శింగనమల	51	రూ.2.20
గార్లదిన్నె	42	రూ.2.70
బుక్కరాయసముద్రం	57	రూ.3.50
నార్పల	64	రూ.3.50
పుట్లూరు	55	రూ.2.30
యల్లనూరు	43	రూ.1.95
మొత్తం	312	రూ.16.15

క్లుప్తంగా

సర్టిఫికెట్ కోర్సులు అవసరం



సదస్సుకు హాజరైన అధ్యాపకులు

బుక్కరాయసముద్రం: బీటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులు ఎంతో అవసరమని ఐసీటీ అకాడమీ ప్రతనిధి సయ్యద్ కమరన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చేత ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కోర్సును చేయించ వలసిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించడానికి సర్టిఫికెట్ కోర్సులు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రంజిత్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఐక్యూసీ సాయి చైతన్య కిషోర్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి వీర ప్రకాష్, హేమంత్ కుమార్ యాదవ్, చిత్రలింగప్ప, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రాజేష్‌బాబు, నగేష్,అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు శత కలశాభిషేకం

తాడిపత్రి అర్బన్: పెన్నానది ఒడ్డున వెలసిన సాలగ్రామ వైద్య ఆంజనేయస్వామికి పవమాన సూక్త హోమ సహిత అష్టోత్తర శత కలశాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి తాడిపత్రి శాఖ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీటీఎస్ శేషాద్రి అయ్యంగార్ బృందంచే లోక కల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

ఐదు ఆధార్ కేంద్రాల ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

సాక్షి ఎఫెక్ట్..

గుత్తి: గుత్తి మున్సిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా శుక్రవారం అదనంగా ఐదు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. ఈ నెల 18న సాక్షి దినపత్రికలో ఆధార్.. బేజార్ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మూడు, మండలంలో రెండు అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుత్తి మున్సిపాలిటీలోని ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం, కొత్తూరు సచివాలయం, జంగాల కాలనీలోని సచివాలయంలో అదే విధంగా మండలంలోని కరిడికొండ, జక్కల చెరువు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుత్తిలో ఏర్పాటైన ఆధార్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లుటౌన్: స్థానిక ఆలూరు రోడ్‌లోని 133 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిధిలో మండీబజార్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర, ఏఈ రఘునాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీ2 పరిధిలోని మండీబజార్, పాతబస్టాండ్, గుట్టలవీధి తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని వారు కోరారు.

అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

గుంతకల్లు రూరల్: అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు గుంతకల్లు పట్టణంలోని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన తమ కళాశాల విద్యార్థులు అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి విద్యార్థులను సత్కరించారు. కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ మహిళల ఖోఖో పోటీలు, పురుషుల ఖోఖో విభాగంలో తిరువనంతపురం సెంట్రల్ యూనివర్శిటీలో ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించే పోటీలు, తమిళనాడులోని అన్నా యూనివర్శిటీలో కబడ్డీ పోటీలు, చండీగర్ విశ్వ విద్యాలయంలో రగ్బీ పోటీలు, తమిళనాడులోని అళగప్ప విశ్వవిద్యాయలంలో కబడ్డీ మహిళా పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



రాయలచెరువులో మురుగును పరిశీలి స్తున్న రాయలసీమ జోనల్ మలేరియా అధికారి లక్ష్మణ్

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో రాయలసీమ మలేరియా జోనల్ అధికారి లక్ష్మణ్ నాయక్, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యుడు పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహ కల్పించారు. గ్రామంలో మురుగు నీటి కాలువలను పరిశీలించి శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించాలన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అప్పయ్య. దేవరాజ్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీని వాసులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న పీడీ ఈశ్వరయ్య

పెద్దపప్పూరు: మహిళా సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి మహిళ మండలి కార్యాలయంలో తాడిపత్రి ఏపీ క్లస్టర్ పరిధిలోని మండలాల సీసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలన్న అంశాన్ని గ్రామ స్థాయిలో సంఘం సభ్యులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏసీ వీరా స్వామి, ఏపీఎం శివకుమార్ రెడ్డి, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాలకు చెందిన వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తాం

యల్లనూరు/పెద్దవడుగూరు/పామిడి/యాడికి: భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు రాజా అన్నారు. శుక్రవారం యల్లనూరు మండలంలోని వెన్నపూసపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు కార్యక్రమంలో సర్వేయరు శర్వాణి, ఆర్ఐ నారాయణమ్మ, వీఆర్వో కేశవరెడ్డి పాల్గొన్నారు.

✦ పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, నాగలాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లహరిక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

✦ పామిడి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ అన్యాక్రాంత స్థలాలను సంరక్షించాలంటూ ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ఎంసీ సుంకన్న తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాస రెడ్డి, సర్వేయర్ మురళీధర్, ఈఓ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

✦ యాడికి మండలంలోని వేములపాడులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. సభలో సర్పంచు ఓంకారమ్మ లేదని విలేకరులు అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో.. అప్పటికప్పుడు అధికారుల సూచన మేరకు వీఆర్ఏ వెళ్లి ఉదయం 11.30 నిముషాలకు సర్పంచును గ్రామసభకు తీసుకు పోవడం గమనార్హం. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

సరిహద్దులు ఏర్పాటు చేయించండి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: గుంతకల్లు పట్టణంలోని వినాయక ఘాట్ వద్ద రెడ్డి సంక్షేమ సంఘానికి చెందిన (సర్వే నంబర్ 614–ఎ3లో గల ఎల్‌పీ నంబర్ 12–1984) స్థలాన్ని రీ సర్వే చేయించి సరిహద్దులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్‌ను రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కలసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. సర్వే చేసి హద్దులు చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కె.వి.రంగారెడ్డి, తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీష్ రెడ్డి, కోశాధికారి నీలకంఠరెడ్డి, సంయుక్త కార్యదర్శులు రంగస్వామిరెడ్డి, అనంతసేనా రెడ్డి, మహిధర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, సూర్యచంద్రారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమిత్ షాను బర్తరఫ్ చేయాలి'

గుత్తి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో శుక్రవారం సీపీఐ, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్‌తో పాటు కుల, ప్రజా సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గద్దల నాగభూషణం, కేవీపీఎస్ మండల నాయకుడు మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకుడు అడవి రాముడు, మాల సంఘం నాయకులు బేల్దారి చంద్ర మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు విజయ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, సీపీఐ సహాయ కార్యదర్శి నరసింహయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

యల్లనూరు: కల్లూరుకు చెందిన నాగార్జున అనే వృద్ధుడు భార్య సాయి కుమారితో గొడవ పడి గురువారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. అతడి భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

తాడిపత్రిటౌన్/గుంతకల్లు టౌన్/శింగనమల/పామిడి/యల్లనూరు/బుక్కరాయసముద్రం: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని వారు కోరారు.

✦ తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం ఉదయం 10గంటలకు కార్యాలయంలో కేక్ కటింగ్ ఉంటుంది అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కన్వీనర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాథాశ్రమం, వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

✦ గుంతకల్లులో శనివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ అనంతరం ప్రభుత్వాస్పత్రి, వృద్ధాశ్రమం, అనాథ బాలుర ఆశ్రమాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తెలిపారు.

✦ బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వైఎస్సార్ సర్కిల్‌లో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత ఆలూరి సాంబశివారెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కేక్ కటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రి దగ్గర అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

✦ శింగనమలలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, అక్కడే కేక్ కట్ చేస్తామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ఎం.నవీన్‌కుమార్, డి.భాస్కర్‌రెడ్డి తెలిపారు

✦ పామిడిలో వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించే సేవాకార్యక్రమాలను జయప్రదం చేయాలని పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు.

✦ యల్లనూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా





గుంతకల్లు, గుత్తిలో డ్రోన్ ద్వారా గుర్తించి మందు బాబులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ప్రక్రియ కొనసాగుతుందని వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సమస్యాత్మక ప్రదేశాలు, శివారు ప్రాంతాల్లో పోలీసుల గస్తీతో పాటు డ్రోన్ కెమెరాల నిఘా ప్రక్రియను ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, జూదం, అక్రమ మద్యం, గంజాయి రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను సులువుగా అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. డ్రోన్ ద్వారా చిత్రీకరించిన దృశ్యాలను పరిశీలించి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ వినియోగం ద్వారా పలువురు అపరిచిత వ్యక్తులతోపాటు ముగ్గురు మందుబాబులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గుత్తి: గుత్తి పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం డ్రోన్ కెమెరా సాయంతో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందు బాబులను పసిగట్టారు. గుత్తి పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఐదుగురు మందు బాబులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని వైష్ణవి పాఠశాలలో ఈ నెల 22న ఓపెన్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి సాయిబాబా శుక్రవారం తెలిపారు. పోటీల్లో సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొటారని వారు తెలిపారు.

భవానీ మాత ఊరేగింపు

గుంతకల్లుటౌన్: దుర్గాభవానీ అమ్మవారి మాలను ధరించిన స్వాములు శుక్రవారం రాత్రి పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. భవానీ మాతను విశేష పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. పాతగుంతకల్లులోని శివాలయం నుంచి సత్యనారాయణపేటలోని అమ్మవారి ఆలయం వరకూ ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ



మాట్లాడుతున్న సీఐ మహమ్మద్ రఫీ

యల్లనూరు: హత్య కేసులో చిక్కుముడి వీడింది. యల్లనూరు మండల కేంద్రానికి చెందిన సురేష్‌ను వైఎస్సార్ జిల్లా లావనూరు గ్రామ సమీపంలోని నల్లవంక బ్రిడ్జి వద్ద ఈ నెల 17 తెల్లవారుజామున పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చిన్నగుల్లో బన్నగారి వీరకుమారి, గుజ్జప్ప గారి బాబు, వెలిదండ్ల సుబహాన్, చుక్కలూరు కిరణ్ కుమార్ హత్య చేసినట్లు వైఎస్సార్ జిల్లా ఆర్ఎస్ కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. ప్రొద్దుటూరు కోర్టులో నిందితులను హాజరుపర్చి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. అక్రమ సంబంధం నేపథ్యంలో సురేష్‌ను హత్య చేశారన్నారు.

జకినీ మాత జాతర పోస్టర్ల విడుదల



సునామ జకినీ మాత జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని సునామ జకినీ మాత ఆలయంలో జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణరావు, ధర్మకర్త సురేష్ రావు మాట్లాడారు. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత జాతర (ఆలయ 22వ వార్షికోత్సవం) నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు దేశంలోని నలుమూలల నుంచి ఆరె కటికలు, సునామ జకినీ మాత భక్తులు తరలివస్తారన్నారు. కార్యక్రమంలో సునామ జకినీ మాత ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు సరస్వతీ బాయి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, కోశాధికారి సుధాకర్‌రావు, సభ్యులు బాబురావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సీనియర్ డీపీఓ క్యాప్రల్ అరోరా

గుంతకల్లు రూరల్: రైల్వే పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీనియర్ డీపీఓ క్యాప్రల్ అరోరా అన్నారు. గుంతకల్లు పట్టణంలోని రైల్వే పెన్షనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పెన్షనర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ ప్రధాన కార్యదర్శి సుంకప్ప, ఇతర నాయకులు హాజరయ్యారు.

పరామర్శ



మనోజ్‌కాశిని పరామర్శిస్తున్న కేతిరెడ్డి రమాదేవి

తాడిపత్రిటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు మనోజ్‌కాశిని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి శుక్రవారం పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

పెద్దవడుగూరు: స్థానిక గాంధీసర్కిల్‌లో హైదరాబాద్‌కు చెందిన రంగనాథరావు 60 మంది వృద్ధులు, అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు సాయం చేసే అలవాటు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.